పగుళ్లిచ్చిన పట్టించుకోరా..!



డీవీసీ కాలనీలో గుంతలతో ప్రమాదకరంగా ఉన్న సిమెంటు రహదారి



ఆలూరు రోడ్డులో అధ్వానంగా ఉన్న సిమెంటు రోడ్డు

పట్టణ పరిధిలోని పలు సిమెంటు రహదారులు పగుళ్లిచ్చి అధ్వానంగా మారాయి. మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదు. డీవీసీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలో అడుగడుగునా గుంతలు ఏర్పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రి వేళల్లో వాహన రాకపోకలకు చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాల టైర్లు గుంతలలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఆలూరుకు వెళ్లే రోడ్డు, అంబేడ్కర్ నగర్ పార్కుకు వెళ్లే సిమెంటు రహదారులు ముక్కలుగా విరిగి మధ్యలో గోతులు ఏర్పడ్డాయి.

– పొన్నూరు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కాకుమాను: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు పెదనందిపాడు ఏఈ వీరాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పెదనందిపాడు, నాగులపాడు, అన్నవరం గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

చికెన్, కోడిగుడ్లపై అపోహలు వద్దు

పెదకాకాని: చికెన్, కోడిగుడ్లపై సోషల్ మీడియాలో వస్తున్న అపోహలను నమ్మవద్దని పలువురు చికెన్ షాపు వ్యాపారులు తెలిపారు. పెదకాకాని సెంటర్‌లో శుక్రవారం చికెన్, గుడ్ల వినియోగంపై వ్యాపారులు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారస్తులు మాట్లాడుతూ జీబీఆర్ హెచరీస్, ఎస్‌ఎల్‌సీ బ్రాయిలర్ చికెన్ ఫ్రెష్ షాపు ఆధ్వర్యంలో ప్రజలకు బిర్యానీ రైస్, చికెన్ కర్రీతో అన్న ప్రసాద వితరణ చేయడం జరిగిందని అన్నారు. మాంసాహార ప్రియులు చికెన్, గుడ్ల వినియోగంపై ఆందోళన చెందవద్దని తెలియజేశారు. బర్డ్ ఫ్లూ పక్షులకు మాత్రమే వస్తుందని, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తే వైరస్ సోకదని స్పష్టం చేశారు. భయపడకుండా చికెన్, కోడిగుడ్లు కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు.

ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు మద్దతుగా విస్తృత ప్రచారం



పొన్నూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు మద్దతు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ కోరారు. శుక్రవారం పట్టణంలోని తెలగపాలెంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా ఎమ్మెల్సీగా బాధ్యతలు నిర్వహించిన లక్ష్మణరావును మళ్లీ గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. సమస్యలపై మాట్లాడే శక్తి ఉన్న లక్ష్మణరావును గెలిపించుకుంటే శాసనమండలిలో సమస్యలపై ప్రశ్నిస్తారని అన్నారు. కార్యక్రమంలో భావన్నారాయణ, సీఐటీయూ మండల కార్యదర్శి రమేష్ బాబు, నాయకులు నాయక్, రాజు, ప్రసన్న పాల్గొన్నారు.

జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలి



చేబ్రోలు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల ద్వారా కూలీలు తమ జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని ఎంపీడీఓ ఎ.ఉమాదేవి అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులో శుక్రవారం రోజ్‌గార్ దివస్ గ్రామసభ నిర్వహించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల గురించి నిర్వహించిన సమావేశంలో ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఎంపీడీఓ ఉమాదేవి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఉపాధి హామీ పనుల నిర్వహణ కోసం గ్రూపు సభ్యుల దగ్గర నుంచి డిమాండ్ తీసుకొని ఈ పనులన్నీ వారంలో పూర్తయ్యే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. మండలంలో ఉపాధి హామీ కూలీల పని దినాలు సంఖ్య మెరుగుపరచుకోవాలన్నారు. పని దినాలు తగ్గకుండా చూడాలని, ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, మెట్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజల, రైతుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ కె.ఆనందమోహన్, జి.ప్రసాద్ పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కొరిటెపాడు: గుంటూరు నగరంపాలెంలో ఉన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం వద్ద బ్యాంకు యూనియన్ నాయకులు శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సిబ్బంది నియామకం, తాత్కాలిక ఉద్యోగుల నియామకం చేపట్టాలన్నారు. ప్రజల దాడుల నుంచి బ్యాంకు ఉద్యోగుల రక్షణ కల్పించాలన్నారు. గ్రాట్యుటీ చట్ట సవరణ చేసి, పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలన్నారు. సిబ్బంది సంక్షేమ ప్రయోజనాలపై ఆదాయ పన్ను మినహాయింపు కల్పించాలని కోరారు. ఐబీఏ పెండింగ్ సమస్యల పరిష్కరించాలన్నారు. మార్చి 3న ఢిల్లీలో పార్లమెంట్ ముందు ధర్నా నిర్వహించి, ఆర్థిక మంత్రి, డీఎఫ్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మార్చి 24, 25న దేశవ్యాప్తంగా రెండు రోజుల బ్యాంక్ సమ్మె నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ గుంటూరు సర్కిల్ ప్రాంతీయ కార్యదర్శి కె.ఆర్.జయ కుమార్, డెప్యూటీ జనరల్ సెక్రటరీ కె.కోటి రెడ్డి, పి.కిషోర్ కుమార్, రవి చంద్ర రెడ్డి, సయ్యద్ మొహమ్మద్ బాషా, ఎం.సాంబశివరావు, ఎం.రాంబాబు, పి. కళ్యాణ్ పాల్గొన్నారు.

శ్రీ అగస్త్యేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు

గుంటూరు రూరల్: మండలంలోని నల్లపాడులోని శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 26వ తేదీన ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించటం జరుగుతుందని పేర్కొన్నారు.

శ్రీ పుష్యాద్రి లక్ష్మీనరశింహ క్షేత్రంలో...

వెంగళాయపాలెంలోని పుష్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రంలో మహా శివరాత్రిపర్వ దినం సందర్భంగా పుష్యాద్రి ఆకాశమల్లేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి తిరునాళ్ల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బెండపూడి వెంకటసీతారామ్, ఉపాధ్యక్షుడు కొల్లి తిరుపతిరెడ్డి, కోశాధికారి ముప్పాళ్ల నరసింహారావు, ఉపకోశాధికారి దుగ్గెంపూడి శ్రీనివాస రెడ్డిలు తెలిపారు.

అక్కడ వెలగవు.. ఇక్కడ ఆరవు

- అస్తవ్యస్తంగా వీధి దీపాల నిర్వహణ
- ప్రజలకు తప్పని అవస్థలు

పొన్నూరు: పట్టణంలో వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా మారింది. పలు ప్రాంతాల్లో రాత్రిళ్లు అంధకారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల పగలు వెలుగులతో మున్సిపాలిటీ విద్యుత్ బిల్లు మోత మోగుతోంది. అసలే గుంతల రహదారులు.. అందులోనూ చీకటితో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.. వృద్ధులు, పిల్లలు చీకట్లో నడిచేందుకు భయాందోళనకు గురవుతున్నారు. దీంతో లైట్లు వెలగని వీధుల్లో వెళ్లాలంటేనే ప్రజలు వెనుకంజ వేస్తున్నారు. శివారు ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ప్రధాన కూడళ్లు, పలు వార్డుల్లోని వీధుల్లో పర్యవేక్షణ లేక వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. డీవీసీ కాలనీలో శుక్రవారం వీధి లైట్లు పగలు కూడా వెలుగులతో దర్శనమివ్వడంతో అధికారుల పనితీరుపై విమర్శలు వ్యక్తమయ్యాయి. క్యాబిన్ పేట ఐటీఐ కళాశాలకు వెళ్లే దారిలో వీధి దీపాలు వెలగక అంధకారంగా ఉండటంతో ట్యూషన్‌కు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాడైన వాటికి సకాలంలో మరమ్మతులు చేయక సమస్య మరింత జటిలమవుతోంది. వీటిపై మున్సిపల్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆయా కాలనీల వాసులు చెబుతున్నారు. వీధుల్లో చీకటితో దొంగతనాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా వీధి దీపాల నిర్వహణ సక్రమంగా ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



డీవీసీ కాలనీలో పగలే వెలుగుతున్న వీధి దీపాలు

ముగిసిన ఏఐసీటీఈఐడీఈ బూట్ క్యాంపు



మాట్లాడుతున్న ఏపీ సీఐఐ చైర్మన్, బెటర్ క్యాస్టింగ్ సీఈఓ ప్రసాద్

గుంటూరు రూరల్: వినూత్న ఆవిష్కరణల దిశగా విద్యార్థులు ఆలోచనలు చేయాలని ఏపీ సీఐఐ చైర్మన్, బెటర్ క్యాస్టింగ్ సీఈఓ జేఎస్ఆర్‌కే ప్రసాద్ పేర్కొన్నారు. ఏఐసీటీఈ, మినిస్ట్రీ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో వాధ్వాని ఫౌండేషన్ సౌజన్యంతో చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్ బూట్ క్యాంపు శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమంలో పలు రాష్ట్రాల నుంచి వచ్చిన వివిధ కళాశాలల విద్యార్థులు వారి నూతన ఆవిష్కరణ నమూనాల ప్రదర్శన, నిపుణుల బృందంచే సాంకేతిక, అంకుర పరిశ్రమల స్థాపన, నూతన ఆవిష్కరణలకు సూచనలు, అందులోని వివిధ దశలు తదితర అంశాలను గురించి వివరించారు. ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఎదురున్న సమస్యలను సవాళ్లుగా స్వీకరించి వినూత్న పరిష్కార మార్గాలను చూపాలని, వ్యాపారానికి ధనమే ప్రధాన పెట్టుబడి కాదని, ఆలోచనలను కూడా పెట్టుబడులుగా మార్చుకోవాలని వివరించారు. కార్యక్రమంలో ఏఐసిటిఈ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఇంజ నాగభీమలింగేశ్వర్‌రెడ్డి, వాధ్వాని ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ ఆర్ సుప్రభా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మిలానోత్సవ్ 4.0 రాష్ట్ర స్థాయి క్రీడా ఉత్సవాలు



క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభిస్తున్న అతిథులు, కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సీఎల్‌పీటీ మిలానోత్సవ్ 4.0 క్రీడాఉత్సవాలు శుక్రవారం ప్రారంభించారు. భాష్యం విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, డైరెక్టర్ భాష్యం రామకృష్ణ హాజరై మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక, సామాజిక అభివృద్ధికి ఎంతో అవసరం అవుతాయన్నారు. క్రీడలు కేవలం శరీర శక్తిని పెంచే ప్రక్రియ మాత్రమే కాకుండా, మనలో మంచి మనోబలాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, సమర్థతను, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయన్నారు. శ్రేష్ఠ హాస్పిటల్ డైరెక్టర్, కార్డియాలజీ డాక్టర్ గొట్టిపాటి నాగార్జున మాట్లాడుతూ ప్రతి విద్యార్థి, క్రీడాకారులు ప్రతి ఒక్కరు తన ప్రతిభను ప్రదర్శించడానికి, అద్భుతమైన పనితీరును చూపడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ దేశానికి అమూల్యమైన సంపద యువతని, ఇటువంటి క్రీడా ఉత్సవాలలో విద్యార్థులు భాగస్వాములు కావడం ద్వారా జిజ్ఞాస సమయపాలన స్థిరత్వం వంటి ఎన్నో లక్షణాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ వాలీబాల్, కబడ్డీ, త్రో బాల్, క్యారమ్స్, చెస్, రన్నింగ్ వంటి 12 రంగాలలో బాల బాలికలకు పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఉన్నత విద్యనందించడమే లక్ష్యం



కాకుమాను: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ఉన్నత విద్యనందించి వారిని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాల్లో ఉంచడమే విజ్ఞాన్ యూనివర్సిటీ ముఖ్య ఉద్దేశమని సీడీఓఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.వీరాంజనేయులు అన్నారు. పెదనందిపాడు కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ కాలేజీ విద్యార్థులకు శుక్రవారం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో డేటా సైన్స్ యూసింగ్ పైథాన్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అడిషనల్ డైరెక్టర్ కల్పన, కె.ప్రవీణ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వీర రాఘవయ్య, కె.ప్రతాప్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కథల పుస్తకాలు చదవాలి

నగరంపాలెం: చిన్నారులు కథల పుస్తకాలు చదవాలని, వారిలో కథలు రాసే ఆసక్తి పెరగాలని గుంటూరు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.సుభాని అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా బ్రాడీపేటలోని ది సెంట్రల్ స్కూల్‌లో లేఖా సాహిత్యంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. రచయిత్రి తాటికోల పద్మావతి మాట్లాడుతూ తెలుగు తప్పని సరిగా చదవడం, రాయడం నేర్చుకోవాలని అన్నారు. అనంతరం లేఖా సాహిత్యం పోటీల్లో గెలు పొందిన విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరక్టర్ రామచంద్ర, ప్రిన్సిపాల్ జ్ఞానశ్రీ, తెలుగు మాష్టారు వెంకటేశ్వరరావు, సంఘం ఉపాధ్యక్షులు బొమ్ము ఉమా మహేశ్వరరెడ్డి, కోశాధికారి నానా, కవిశ్రీ వశిష్ట సోమేపల్లి పాల్గొన్నారు.

27న సాధారణ సెలవు

లక్ష్మీపురం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 27న ప్రభుత్వ ఉద్యోగులకు సాధారణ సెలవు ప్రకటించినట్లు సహాయ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ షేక్ ఖాజావలి శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు ప్రకటించినట్లు వివరించారు. ఎన్నికల రోజు పని చేసే అన్ని ప్రైవేట్, వ్యాపార మేనేజ్‌మెంట్, అథారిటీస్, ట్రేడింగ్స్, ఇండస్ట్రియల్ అండర్ టేకింగ్స్, ఇతర సంస్థలు, వారి కార్యాలయాలలో పని చేసే ఉద్యోగస్తులు ఎవరైననూ ఈ ఎన్నికలకు రిజిస్టర్ ఓటర్లు అయితే వారికి వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అనుమతి, ఆలస్యపు అనుమతిని, షిఫ్ట్‌ల సర్దుబాటు విధులకు గైర్హాజరు అయ్యేందుకు అనుమతించాల్సిందిగా సూచించారు.

మార్చి ఒకటి నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో మార్చి ఒకటో తేదీ నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయంపై సంపూర్ణ నిషేధం అమలు చేయనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాస్టిక్ ఇయర్ బడ్స్, ప్లాస్టిక్ స్టిక్స్ ఉన్న బెలూన్లు, ప్లాస్టిక్ జెండాలు, క్యాండీ స్టిక్స్, ఐస్ క్రీమ్ స్టిక్స్, అలంకరణ కోసం వినియోగించే థర్మాకోల్, ప్లాస్టిక్ ప్లేట్స్, కప్స్, గ్లాసులు, ఫోర్క్, స్పూన్లు, కత్తులు, స్ట్రాలు, ట్రేలు, స్వీట్ బాక్స్‌ల్లో ప్యాకింగ్ ప్లాస్టిక్, ప్లాస్టిక్ ఇన్విటేషన్ కార్డ్‌లు, సిగరెట్ ప్యాకెట్స్, 100 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ఫ్లెక్సీ బ్యానర్ల వినియోగం, విక్రయం నిషేధం అమలులో ఉంటుందన్నారు. నిషేధ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అద్దె బకాయిలు చెల్లింపు

గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన షాపుల అద్దెలు మార్చి నాటికి నూరు శాతం చెల్లించాలని, బకాయిలు ఉన్న షాపులను సీజ్ చేయడానికి రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం లీలా మహల్ ఎదురుగా ఉన్న నగర పాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపుల లీజుదారులు 2024–25 ఏడాదికి సంబంధించిన అద్దె మొత్తాన్ని కమిషనర్ చాంబర్‌లో కమిషనర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆర్వో షాదిక్ బాషా, ఆర్ఐ కాశియ్య పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలి

నగరపాలక సంస్థ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరిగేలా ప్రజారోగ్య కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలని, రోడ్ల మీద, కాలువల్లో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి అపరాధ రుసుం విధించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ తమ రోజువారీ పర్యటనలో భాగంగా సాయి నగర్, అంకిరెడ్డిపాలెం, ఏటి అగ్రహారం, శ్రీరాం నగర్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య కార్మికుల రేషనలైజేషన్ పూర్తి అయిన నేపథ్యంలో వార్డు సచివాలయాల వారీగా పారిశుద్ధ్య పనులను డ్రైవ్ మోడ్‌లో చేపట్టాలన్నారు. అంకిరెడ్డిపాలెంలో ప్రజలతో స్థానిక సమస్యలపై మాట్లాడి, ఆయా సమస్యల పరిష్కారానికి విభాగాల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. ఏటీ అగ్రహారం రిజర్వాయర్ పంప్ హౌస్‌ని పరిశీలించి, రానున్న వేసవి దృష్ట్యా అన్ని మోటార్లు వర్కింగ్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రిజర్వాయర్ పరిధిలో పైపులైన్ లీకుల మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. పర్యటనలో డీఈఈలు శ్రీనివాస్, మధుసూదన్ పాల్గొన్నారు.



కమిషనర్‌కు అద్దె బకాయిలకు సంబంధించిన చెక్కులను అందజేస్తున్న షాపు లీజుదారులు

సెల్లార్‌లను పార్కింగ్ కోసమే వినియోగించాలి

హాస్పిటల్స్, కమర్షియల్ భవనాలు సెల్లార్లను పార్కింగ్ కోసమే వినియోగించాలని, ఇతర అవసరాలను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో సెల్లార్ల వినియోగం, ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణ అంశాలపై నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు, ట్రాఫిక్ అధికారులు, ఐఎంఏ ప్రతినిధులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ రెహ్మాన్, తూర్పు ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్, ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ సుబ్బారాయుడు, డాక్టర్ సాయి కృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలి

గుంటూరు నగరంలో వార్డు సచివాలయాల వారీగా ప్రభుత్వ ప్రాధాన్య సర్వేలను సకాలంలో పూర్తి అయ్యేలా నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారం సర్వేల వేగవంతంపై నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు పాల్గొన్నారు.

తెలుగుభాష గొప్పతనాన్ని గుర్తించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగుభాష గొప్పతనాన్ని గుర్తించాలని ఏఎన్‌యూ విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు విభాగ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాంబశివరావు మాట్లాడుతూ తెలుగువారిగా జన్మించడం మన అదృష్టమని, తెలుగుభాష ఘనతను చాటిన కరుణశ్రీ, కొసరాజు, శ్రీశ్రీ, కాళోజీ తదితర కవుల పద్యాలను, వారు చేసిన కృషిని వివరించారు. ఈసందర్భంగా ఆయన సొంతంగా రచించి, నిర్మించిన కవిరాజ విజయం టెలీఫిల్మ్‌ను ప్రదర్శించారు. కళాశాల తెలుగుశాఖాధిపతి డాక్టర్ ఎన్.విజయలక్ష్మి మాట్లాడుతూ మాతృభాషలో విద్యనభ్యసించినవారిలోనే సృజనాత్మకత ఎక్కువ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ మధుసూదనరావు, అధ్యాపకులు డాక్టర్ వి.భవానీ, డాక్టర్ డి.ధాత్రికుమారి, డాక్టర్ డి.దివిజాకుమారి, డాక్టర్ సి.విజయలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రావెల సాంబశివరావు

కార్పొరేట్‌కు ధీటుగా ఉత్తమ ఫలితాల సాధన

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కార్పొరేట్‌కు ధీటుగా ఉత్తమ ఫలితాలను సాధిస్తోందని ఇంటర్మీడియెట్ విద్య ఆర్‌ఐఓ జీకే జుబేర్ పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల 28వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆర్‌ఐఓ జుబేర్ మాట్లాడుతూ విద్యార్థినుల ప్రవేశాలతో పాటు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించడంలోనూ అగ్రస్థాయిలో నిలిచిన జూనియర్ కళాశాల పేద, మధ్య తరగతి విద్యార్థినులకు ఆసరాగా నిలిచిందని చెప్పారు. డీవీఈఓ జె.పద్మ మాట్లాడుతూ సంకల్ప్ 225 ద్వారా విద్యార్థినులకు అందిస్తున్న క్వశ్చన్ బ్యాంక్, విద్యాశక్తి ద్వారా చెన్నై ఐఐటీ నుంచి భౌతిక, గణితశాస్త్రాలతో పాటు ఆంగ్లంలో శిక్షణ వంటి అంశాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతేడాది 30 మందికి పైగా ఆర్ట్స్, సైన్స్ విద్యార్థినులు 90 శాతానికి పైగా మార్కులను సాధించారని, ప్రస్తుతం ఆ సంఖ్య మరింతగా పెరగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.సునీత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌ఐఓ జుబేర్, వేదికపై డీవీఈఓ పద్మ, ప్రిన్సిపాల్ సునీత

కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో పనిచేసే కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతినెలా ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని, కార్మికులు ఉద్యోగులు తమ సమస్యలపై నేరుగా తమకు అర్జీలు, ఫిర్యాదులు అందించవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్మికులు, ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం వర్కర్స్ గ్రీవెన్స్‌ని కమిషనర్ ఛాంబర్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ

కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగర పాలక సంస్థ అండగా ఉంటుందని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందిచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య విభాగ ఔట్ సోర్సింగ్ కార్మికులు బండి భవానీ కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెక్కును, ఈ నెల 18న ప్రమాదంలో మరణించిన జీ కొండమ్మ కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల చెక్కులను శుక్రవారం కమిషనర్ అందజేశారు. సదరు కార్మికుల కుటుంబాలకు నగర పాలక సంస్థ నుంచి అందాల్సిన పరిహారాలు, పీఎఫ్ కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాధిపతులను, సూపరింటెండెంట్లను కమిషనర్ ఆదేశించారు.

వృద్ధుకు వైద్య పరీక్షలు



నెహ్రూనగర్: వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలు ఎక్కువగా వస్తుంటాయని వాటిని అశ్రద్ధ చేయకుండా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకుని మందులు వాడటం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని డీపీఓ(జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్) రోహిణి, ఎన్‌సీడీ జిల్లా కన్సల్‌టెంట్ డాక్టర్ గిరిధర్‌లు పేర్కొన్నారు. అటల్ వయో అభ్యుదయ యోజన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నెహ్రూనగర్ చివర ఉన్న వెంకటాద్రిపేటలోని వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వారు మాట్లాడుతూ అటల్ వయో అభ్యుదయ యోజన కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు ముందస్తుగానే ఆరోగ్య సిబ్బంది రక్త పరీక్షలు, ఈసీజీ, ఇతర పరీక్షలు చేసి ఉంచడం జరిగిందని, వైద్య పరీక్షలు చేసుకున్న వారిని పరీక్షించి మందులు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన వైద్యులు శ్వేత, నివేదిత, సుప్రియ, స్వప్న, విజయలక్ష్మి, ఆశీర్వాదం పాల్గొన్నారు.